కథా నిలయం
4631
శ్రీకాకుళం



# వసుధైక కుటుంబకమ్

ఒక ప్రైవేటు కాలేజీలో తెలుగు లెక్చరర్ ఉద్యోగానికి కమిటీవారు ఇంటర్వ్యూలు చేస్తున్నారు.

"మీకు తెలుగు సాహిత్యంలో ఏ కావ్యం అంటే ఎక్కువ ఇష్టం?" అడిగేరో కమిటీ సభ్యుడు ఒక లెక్చరర్ ఉద్యోగార్థిని.

"విజయ విలాసం"

"రచయిత"

"చేమకూర వేంకటకవి" సమాధానం సరిగ్గానే చెప్పేడు. అందులో ఒకటి రెండు పద్యాలు చదవమన్నారు. చదివేడా ఉద్యోగార్థి.

అలాగే కళాపూర్ణోదయం మీదా, పాండురంగమాహాత్మ్యం మీదా ఆముక్తమాల్యద, మను-వసుచరిత్రల మీదా-ఇలా రకరకాల కావ్యాల మీదా ఉద్యోగార్థుల్ని ఇంటర్వ్యూ చేసేరు. తమకు నచ్చిన కొన్ని ఘట్టాలలో కొన్ని పద్యాలు చదివి వినిపించమన్నారు. ఉద్యోగార్థులందరూ అలాగే చేసేరు.

"సరే మీరు వెళ్లండి. తరువాత ఏ విషయం తెలియజేస్తాం" అన్నారు.

ఉద్యోగార్థులు నిష్క్రమించేరు. ఇంకొక ఉద్యోగార్థిని ఇంటర్వ్యూ చేయవలసి వుంది. ఆయన్ను పిలిపించేరు. అందరిలాగానే ఆయన కూడా వచ్చి కమిటీముందు నిల్చున్నారు చేతులు జోడిస్తూ.

"మీ పేరు?"

"కురంగపాణి."

"మీరు చదివిన కావ్యాల్లో, ప్రబంధాల్లో మీకు అత్యంత ప్రీతికరమైనదేది?"

"పోతనామాత్యుని శ్రీమద్భాగవతం."

"పోతనామాత్యుడు, కొందరికి తెలుగంటే ఇష్టం మరికొందరికి రెండూ ఇష్టం అని ఓ పద్యం చెప్పేడు, అదేమిటో చెబుతారా?"

"తప్పకుండా" అంటూ, కొందరకు తెనుగు గుణమగు కొందరకును సంస్కృతంబు గుణమగు, రెండున్ కొందరకు గుణములగు, నేనందర మెప్పింతు కృతుల నయ్యెడలన్" అని పద్యం చెప్పాడు. అది విని కమిటీ వారు మనోల్లాసం చెందినా బయటపడకుండా గుంభనగా వుండిపోయారు. తరువాత రెండవ ప్రశ్న సంధించేరు "పోతన గారు వ్రాసిన ఒక శ్లోకం ఉట్టంకిస్తూ సందర్భం చెప్పండి" అని.

"వామనమూర్తికి మూడడుగుల స్థలం ధారపోసిన సందర్భంలో, విప్రాయ, ప్రకటవ్రతాయ, భవతే విష్ణుస్వరూపాయ, వేద ప్రామాణ్యవిదే, త్రిపాదధరణిం దాస్యామి" అని జవాబు చెప్పేడు కురంగపాణి.

"సరే, ఏవిషయం తరువాత తెలియజేస్తాం, మీరు వెళ్లొచ్చు" అన్నారు కమిటీవారు.

కురంగపాణి నమస్కరిస్తూ సెలవు తీసుకున్నాడు.

ఇంటర్వ్యూలో సెలెక్టయిన కురంగపాణి, మరో పదిరోజుల్లో ఆంధ్రోపన్యాసకుడుగా ఉద్యోగబాధ్యతలు స్వీకరించేడు.

కురంగపాణి ఐదారేళ్లు సర్వీసు పూర్తిచేసేక, రాజధానిలో సాహిత్యసమావేశాలు జరుగుతున్నట్లు, ఆ సమావేశానికి హాజరు కమ్మని ఆహ్వానం వచ్చింది.

అక్కడ, తనను తెలుగు లెక్చరర్‌గా సెలెక్టు చేసిన కమిటీ సభుల్లో ఒకాయన కనబడ్డారు. అతనికి చేతులు జోడించి నమస్కరిస్తూ "మీ దయవల్ల ఆంధ్రోపన్యాసకుడుగా పనిచేస్తున్నాను. రెగ్యులర్ స్కేల్ కూడా ఇస్తున్నారు" అని ధన్యవాదాలర్పించేరు.

కురంగపాణి వినయవిధేయతలకు చలించిపోయేడు ఆ కమిటీ సభ్యుడు. "నాయనా! ఎవరెన్ని కావ్యాలూ, ప్రబంధాలూ అధ్యయనం చేసినా, పోతనామాత్యుని మహాభాగవతం అధ్యయనం చేయకపోతే, వారి అధ్యయనం అసంపూర్ణమే. శ్రీ మద్భాగవతం చదివితే సర్వవేదోపనిషత్తులూ, పురాణేతిహాసాలూ, కావ్యాలూ, ప్రబంధాలూ అధ్యయనం చేసినట్టే. గర్భస్థశిశువైన ప్రహ్లాదునికి దేవర్షి నారదుని వలన "నారాయణ" అనే నాలుగక్షరాలు

వినడంతో సకల విజ్ఞానమూ అబ్బినట్లుగా. అందుకే నిన్ను సెలెక్టు చేసేము. రైతుకవి పోతనామాత్యుడు మన తెలుగువాళ్లు చేసుకున్న పురాకృతపుణ్యం వలన మనకు లభ్యమయేడు" అన్నాడు ఆనందంగా.

"కృతార్థుణ్ణి" అన్నాడు కురంగపాణి.

ఈ సంఘటన జరిగి నేటికి 35 ఏళ్లయింది. కురంగపాణి కిప్పుడు అరవైఏళ్లు. వారి ఏకైకపుత్రుడు గదాధరం నెలకు ఇరవై వేలు సంపాదిస్తున్న ఒక సాఫ్ట్‌వేర్ ఇంజనీరు. తల్లి హితైషిణికి, తండ్రి కురంగపాణికి షష్టిపూర్తి ఉత్సవం ఘనంగా జరిపించేడు. "కొడుకంటే ఇలా వుండాలి!" అన్నారంతా.

వందమందిని కన్న ధృతరాష్ట్రుడు ఏం సుఖపడ్డాడు?

"నాన్నా! నాకు అమెరికాలో ఉద్యోగం వచ్చింది. మాకంపెనీ వాళ్లే డెప్యుటేషన్ మీద పంపిస్తున్నారు. అన్నాడు గదాధరం.

"వెళ్లకతప్పదా?"అంది తల్లి.

"తప్పదమ్మా! ఈ అవకాశం జారవిడుచుకుంటే శాశ్వతంగా ఇక్కడే చావాలి!" అన్నాడు కొడుకు.

తండ్రి కురంగపాణి చాలా బాధపడ్డాడు. ఇక్కడ చావడమా? ఇక్కడ చావాలంటే ఎంతదృష్టం ఉండాలి? "నాయనా! అమెరికా దేశీయులు తమ యాంత్రిక జీవనంలో మనశ్శాంతి లేక కృష్ణభక్తులై గుండు గీయించుకుని హరిభజనలు చేసుకుంటూ. ద్వారక, జగన్నాథపురి, బృందావనం వంటి క్షేత్రాలను దర్శించుకుని మనశ్శాంతి చెందుతున్నారే! నువ్వేమో మమ్మల్ని వదిలేసి అమెరికా ఎగిరిపోతావా? నువ్వీదేశంలో ఉన్నా మాకేమీ పంపనవసరం లేదు. మాకొస్తున్న పించన్ మాకు చాలు" అన్నాడు కురంగపాణి.

"ఏంటి నాన్నా! మీరింకా పాత చింతకాయ పచ్చడి భావాలతో వున్నారు? ఇంటర్‌నెట్, ఇ - మెయిల్, ఇ - కామర్స్, ఫాక్స్, దేశాలు ఎంత అభివృద్ధి చెందుతున్నాయి? మీతో మాట్లాడాలంటే టెలిఫోన్‌లో మాట్లాడతాను. మీకు ఉత్తరం రాయాలంటే ఫాక్స్ ద్వారా ఉత్తరం పంపిస్తాను. మన పక్కనున్న పబ్లిక్ టెలిఫోన్ బూత్ వాళ్లకి ఫాక్స్ మెషీన్ కూడా వుంది. నేను మీకు రాసిన ఉత్తరాన్ని క్షణాలలో వాళ్లు అందజేస్తారు. అలాగే మీరు నాకు ఉత్తరం రాసినా క్షణాలలో నాకు అందుతుంది. ఎంతసేపూ మనదేశం, మనదేశం అంటూ జపం చేస్తూంటే లాభం లేదు.

రాధాకృష్ణ పండితులు "వసుధైకకుటుంబకం" అనలేదా? 'లోకాస్సమస్తాస్సుఖినో భవన్తు' అనే ఉపనిషద్వాక్యం మీకు నేను చెప్పాలా? సమస్తలోకాల్లోనూ అమెరికా కూడా ఉంది కదా? అక్కడ కూడా వేంకటేశ్వరస్వామి ఆలయాలు మనవాళ్లు బోల్డు కట్టారు!" అని ఓ తెలుగు లెక్చరర్‌గా పనిచేసిన కురంగపాణికి ఓ మినీ లెక్చర్ వినిపించేడు పుత్రరత్నం గదాధరం.

కురంగపాణి మౌనం వహించేడు. మౌనం అర్ధాంగీకారసూచకం. అంటే తన అర్ధాంగి అంగీకారం వున్నట్లు. అబ్బాయి అర్థం సంపాదించడానికి వెళుతున్నాడంటే అది కూడా 'అర్థాం'గీకారమే అవుతుంది.

"ఓ రెండేళ్లు పోయేక కాలూ, చెయ్యీ కూర్చుకుని నిన్నూ, అమ్మనీ కూడా అమెరికా తీసికెళ్లి అక్కడి వింతలూ, విడ్డూరాలూ చూపిస్తాను. ఈలోగా మీ యిద్దరూ పాస్‌పోర్ట్‌కి అప్లై చేద్దురు గాని" అని తల్లిదండ్రులకి ధైర్యం చెప్పి పదిహేను రోజుల్లో పాస్‌పోర్ట్ కూడా సంపాదించి ఉంచేడు.

గదాధరం తన భార్యతో సహా అమెరికా ఎగిరిపోయేడు. వారానికోసారి తల్లిదండ్రులతో తను ఫోన్‌లో మాట్లాడుతూనే ఉన్నాడు. కోడలూ మాట్లాడుతూంది.

రెండేళ్లకల్లా గదాధరం భార్య గర్భవతి అయింది. ఆమెకి ప్రసవసమయంలో సహాయపడ్డానికి ఫీమేల్ ఎసిస్టెన్స్ కావలసి వచ్చింది. గదాధరం, ఇంటికి ఫాక్స్ పంపేడు.

"మీ కోడలు మరో రెండునెలల్లో తల్లి కాబోతూంది. అమ్మకి టూరిస్ట్ వీసా పంపిస్తున్నాను" అని ఫాక్స్ సారాంశం.

తల్లి హితైషిణికి వీసా వచ్చింది. కొడుకు ఫ్లైటు టిక్కెట్ కొని పంపించేడు. తప్పుతుందా?

కురంగపాణిగారు భార్యకు 'తాత్కాలికం'గా వీడ్కోలు చెప్పి, తను హోటల్‌నుంచి కేరేజ్ తెప్పించుకుంటూ, ఇంటికి కాపలా కాస్తూ కాలభైరవుడయేడు.

తన జీవితంలో 35 ఏళ్ల కిందట ప్రవేశించిన సతీమణిని విడిచిపెట్టి వుండడం అదోలా వుంది కురంగపాణిగారికి. ఏమిటో వెలితిగా వుంది.

"అది ప్రేమ కాదు. అదొక అలవాటు" అంటాడు చలం.

అమ్మ క్షేమంగా చేరుకుందని గదాధరం ఫోన్‌లో చెప్పేడు తండ్రికి. "హమ్మయ్య"

అని ఊపిరి పీల్చుకున్నారు కురంగపాణి. సతీమణి కూడా వారానికోసారి భర్తతో మాట్లాడి ఆయనకు తృప్తి కలిగిస్తూ తానూ తృప్తి పడుతూంది. రోజూ రాత్రివేళ పడుక్కోబోయే ముందు హార్లిక్స్ తాగడం మరిచిపోవద్దని హెచ్చరిస్తూంది. వాకర్స్ క్లబ్బులో ఎలాగూ ఆయన సభ్యులే కనుక, రోజూ ఉదయాన్నే నడకకు వెళ్లమని సూచిస్తూంది.

"అలాగేలేవే! అన్నీ చేస్తున్నాను. నువ్వు నిశ్చింతగా వుండు. అక్కడ మంచుతుఫానులు ఎక్కువగా వున్నాయట. జాగ్రత్త! కోడలుకి ప్రసవమనగానే ఫోన్‌లో మాట్లాడు" అంటున్నారు కురంగపాణిగారు.

ఒకానొక శుభోదయాన కురంగపాణిగారికి ఫోను వచ్చింది. కోడలు మగపిల్లవాణ్ని ప్రసవించిందనీ, తల్లీ, పిల్లడూ క్షేమంగా ఉన్నారని, కురంగపాణిగారు పొంగిపోయేరు. సృష్టికర్త అయిన బ్రహ్మదేవునికి 'పితామహు'డని పేరుంది. తనకూ పితామహుడని పిలిపించుకునే అర్హత వచ్చిందని!

మరికొన్నాళ్లకి మరొక ఫోన్ వచ్చింది. ఆ గొంతులో గాద్గద్యం వుంది. జీర వుంది. "నాన్నా! అమ్మని టూరిస్ట్ స్పాట్స్ చూడ్డానికని హెలికాప్టర్ మీద పంపించేను. ఆకాశంలో ఒక ఆకాశహర్మ్యాన్ని హెలికాప్టర్ గుద్దేసింది. అమ్మని అమ్మా అని నోరారా పిలిచే అదృష్టం నాకు లేదు నాన్నా!" అని భోరుమన్నాడు కొడుకు.

ఇప్పుడు కురంగపాణిగారు క్రుంగిపోయేరు. మనవడు పుట్టేడనేఆనందం తునాతునకలైపోయింది. ఏం చెప్పాలో ఏం చెప్పకూడదో తనకు తెలియని దుస్థితిలో అవాక్కయిపోయేరు. మనస్సు వికలమైంది. 'తాత్కాలికం'గా వీడ్కోలు చెప్పిన తన అర్ధాంగి శాశ్వతంగా వీడ్కోలు చెప్పిందే! అని ఓ క్షణం మథనపడ్డారు.

'వాసాంసి జీర్ణాని యథా విహాయ నవాని గృహ్ణాతి నరోపరాణి తథా శరీరాణి విహాయజీర్ణా: అన్యాని సంయాతి నవాని దేహీ॥'

మానవుడు పాతబడిన దుస్తులను విడిచి కొత్తవాటిని ధరించినట్లు, ఆత్మ కూడా నిష్ప్రయోజనాలైన దేహాలను విడిచి కొత్త భౌతికదేహాలను ధరిస్తుంది - అనే భగవద్గీతావాక్యం కురంగపాణిగారికి స్ఫురించి, కొంత ఊరట చెంది గుండె దిటవు చేసుకున్నారు.

"ఇక్కడ అమ్మ భౌతికశరీరాన్ని విద్యుద్దహన వాటికలో దహనం చేసేను. అస్థికలను భద్రపరిచేను. అక్కడ మనదేశంలో పుణ్యనదులలో నిమజ్జనం చేయడానికి పార్సెల్ ద్వారా పంపించమంటారా?" అని కొడుకు ప్రశ్న.

"పార్సెల్ ఎందుకు? ఫాక్స్ ఇంటర్‌నెట్, ఇ - మెయిల్, ఇ - కామ్ ఇంత అభివృద్ధి సాధించిన దేశంలో పార్సెల్లో పంపడమేమిటి? ఇప్పుడు భారతదేశంలోని పుణ్యానదులు గుర్తుకొచ్చేయా? ఓరి వెధవా, నెహ్రూ అంతటివాడే తన అస్థికల్ని పుణ్యానదుల్లో నిమర్జనం చెయ్యమన్నాడురా!"

"ఇది మాత్రం పార్సెల్ ద్వారా పంపక తప్పదు నాన్నా!" అన్నాడు కొడుకు.

మరి అమెరికా ఎంతో అభివృద్ధి చెందిందన్నావు? ఇదేనా అభివృద్ధి? ఇంతకీ ఎముకలు బూడిద నాకెందుకురా? అసలు మనిషే లేనప్పుడు? వసుధైక కుటుంబకం అన్నావు కదరా! అక్కడే ఆ బూడిదని ఏం చేస్కుంటావో చెప్కో!" అన్నారు కురంగపాణిగారు కసిగా.

**స్వర్ణ ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక 18-8-2001**